# భగ్గుమన్న రైతాంగం

- రైతుబంధు నిలిపివేసేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ పార్టీపై నిరసన
- ప్రధాన కూడళ్లలో దిష్టిబొమ్మల దహనం

సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందకుండా నిలువరించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై ఉమ్మడి జిల్లా ప్రజలు భగ్గుమన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రైతుబంధు పంపిణీని నిలిపివేయాలని కుట్రలు పన్నడం సబబు కాదన్నారు. రైతులకు సొమ్ము అందితేనే పెట్టుబడి కష్టాలు తప్పుతాయన్నారు. పేద ప్రజల నోటి కాడికి వచ్చిన కూడును కాలదన్నేందుకే కాంగ్రెస్ పార్టీ పూనుకుంటున్నదని నిరసన వ్యక్తం చేశారు.

– నెట్‌వర్క్


మధిర టౌన్‌లో..


చింతకానిలో..


కొణిజర్లలో..


వైరా టౌన్‌లో..


ముదిగొండలో..


కారేపల్లిలో..

'పాలేరు'కు పెద్ద పాలేరునవుతానన్న

## తుమ్మల ఇప్పుడు ఎవరికి పాలేరు?

**మాజీ మంత్రికి సవాల్ విసిరిన మంత్రి అజయ్**

ఖమ్మం, అక్టోబర్ 26: పాలేరు నియోజకవర్గానికి పెద్ద పాలేరుగా పనిచేస్తానని నాడు ప్రకటించిన మాజీ తుమ్మల నాగేశ్వరరావు ఇప్పుడు ఎవరికి.. ఏ పార్టీకి పాలేరుగా పని చేస్తున్నారో ఆయన ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి, ఖమ్మం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పువ్వాడ నాగేశ్వరరావు సవాల్ విసిరారు. ఖమ్మం నగరం 33వ డివిజన్‌లో గురువారం స్థానిక నాయకుడు గీత వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. తాను వెనుకబడిన వర్గాలకు పదవులు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తుంటే మాజీ తుమ్మల వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. వెనుకబడిన కులాలపై తుమ్మలకు చిన్నచూపు ఉండడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఇప్పుడు తుమ్మల పక్కన ఉన్న నాయకులంతా రౌడీషీటర్లేనని, ఖమ్మం డీసీసీబీలో అక్రమార్కులకు పాల్పడినవారేనని ఆరోపించారు. తుమ్మల బీసీలు, ఎస్సీలు, మహిళలను పిలిచే పద్ధతి జిల్లాలో ప్రతిఒక్కరికీ తెలుసునన్నారు. ప్రస్తుతం తుమ్మలను ప్రజలను ఛీత్కరించుకుంటున్నారన్నారు. ఖమ్మం నియోజకవర్గమే తనకు మొదటి ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. కానీ తుమ్మల ఎక్కడ సీటు ఖాళీగా ఉంటే అక్కడ పాగా వేస్తారని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు ఇస్తున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని, ప్రజాధనంతో నీటిని సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్‌పై ఆధారపడి వేలాది కార్మికులు, వ్యాపారులు జీవనం సాగిస్తున్నారని, కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అలాంటిమార్కెట్‌ను ఖమ్మం నగరం నుంచి వేరే ప్రాంతానికి తరలించేందుకు తుమ్మల యత్నించారని మండిపడ్డారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచే మార్కెట్ తరలిపోకుండా కార్మికుల పక్షాన నిలబడ్డానని గుర్తుచేశారు. ఇక ముందు కూడా మార్కెట్ తరలిపోకుండా శాయశక్తులు ఒడ్డుతానని ప్రకటించారు. నాయకుడు గీత వెంకన్న మాట్లాడుతూ.. ఖమ్మం నగరం నుంచి మార్కెట్ ను తరలించాలని గతంలో నాటి మంత్రి తుమ్మల తీవ్రంగా ప్రయత్నించారన్నారు. మంత్రి పువ్వాడ అజయ్ ఆ కుట్రలన్నింటినీ భగ్నం చేశారన్నారు. మార్కెట్ ఖమ్మంలో ఉంటేనే నగరంలో వేలాది మంది బతుకులు నిలబడతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, వర్తక సంఘం సభ్యులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పారా నాగేశ్వరరావు, సోమా నరేశ్, వేములపల్లి వెంకన్న, మన్నెం కృష్ణ, నున్నా మాధవరావు, కార్పొరేటర్ ఉమ పాల్గొన్నారు.

## 'రైతుబంధు'పై కాంగ్రెస్ కుట్రలు

**బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు**

ఖమ్మం, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రైతులకు ఆర్థిక భరోసానిచ్చే 'రైతుబంధు'పై కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతున్నదని, పథకాన్ని నిలిపివేయాలని ఆ పార్టీ నేతలు ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మండిపడ్డారు. ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కుయుక్తులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకూడదనే ఆ పార్టీ నేతలు ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయిస్తున్నారన్నారు. దీన్నిబట్టి ఆ పార్టీకి రైతులంటే ఎంత చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. రైతుబంధు అందకపోతే రైతులు పెట్టుబడి సాయం అందక ఇబ్బంది పడతారన్నారు. కాంగ్రెస్ పాలనలో పంటలకు కరెంటు లేక రైతులు ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాతే పంటలకు 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన కరెంటు అందుతున్నదన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో ప్రజలు ఓట్ల బుద్ధి చెప్తారన్నారు. కాంగ్రెస్ పార్టీకి గాడ్సే వారసులు నాయకత్వం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులు రైతు పక్షపాతి కేసీఆర్ కావాల్నో.. 3 గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాల్నో తేల్చుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నాయకులు ఉప్పల వెంకటరమణ, తాళ్లూరి జీవన్ కుమార్, దోకుపర్తి సుబ్బారావు, చింతనిప్పు కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

## దళితబంధుపై అపోహలు వద్దు

- కాంగ్రెస్ నేతల మోసపూరిత మాటలు నమ్మొద్దు
- బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక నూటికి నూరు శాతం అమలు
- బీఆర్‌ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు, అక్టోబర్ 26: ఎస్సీలు దళితబంధు అమలుపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దు.. సీఎం కేసీఆర్ హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలో దళితబంధ పథకాన్ని ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆ తర్వాత కూడా అర్హులందరికీ పథకం వర్తింపజేశారు. ఇదే తరహాలో సత్తుపల్లి నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న 30 వేల మంది ఎస్సీ కుటుంబాలకు యూనిట్లు అందుతాయి. ప్రభుత్వానికి అదేమీ కష్టమైన పని కాదు..' అని బీఆర్‌ఎస్ సత్తుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పడమటి లోకవరం, తూర్పు లోకవరం, పుల్లయ్యబంజర, హనుమాతండా, లక్ష్మాతండా, శాంతినగర్, విశ్వబ్రాహ్మణ కాలనీ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేసే సర్కార్ అని, కాంగ్రెస్ ప్రభుత్వంలా వాగ్దానాలకే పరిమితమైన పార్టీ కాదన్నారు. పనిచేసే వ్యక్తులనే ఎన్నికల్లో గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లో జలాలు తక్కువగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో సాగు చేస్తున్న పంటలకు ఇప్పటికే రెండు దఫాలుగా సాగర్ జలాలు ఇచ్చామన్నారు. మరికొన్నిరోజుల్లో ఆరు తడులకు మళ్లీ నీరు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తన హయాంలో తూర్పు లోకవరం గ్రామంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ప్రచార కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌బాబు, సర్పంచ్‌లు కొండల రావు, పెద్దబోయిన కృష్ణవేణి మల్లేశ్వరరావు, సామ్యేలు, నాయకులు బోబోలు లక్ష్మణరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, పెద్దబోయిన మల్లేశ్వరరావు, పెద్దబోయిన నారాయణరావు, బానోతు కృష్ణ పాల్గొన్నారు.


సండ్ర వెంకటవీరయ్యను ఆశీర్వదిస్తున్న మహిళలు


పడమటి లోకవరంలో ప్రచార హోరు

## నేను లోకల్‌గా ఉంటా.. సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా

**బీఆర్‌ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు**


ఎన్నికల ప్రచారంలో లింగాల కమల్‌రాజు

మధిర టౌన్, అక్టోబర్ 26: ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఎప్పుడూ హైదరాబాద్‌లోనే మకాం వేస్తారని, ప్రజాసంక్షేమం ఆయనకు ఏమాత్రం పట్టదని బీఆర్‌ఎస్ మధిర ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజు అన్నారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే స్థానికంగా ఉండి పట్టణాభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. బుధవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. తాను ఎమ్మెల్యే కాకపోయినా జడ్పీ చైర్మన్‌గా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఎన్నో నిధులు రాబట్టానని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే మధిర పట్టణ రూపురేఖలు మారాయన్నారు. ప్రచారంలో నాయకులు పల్లపోతుల వెంకటేశ్వరరావు, బిక్కి కృష్ణప్రసాద్, బోయపాటి వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, భోగ్యం ఇందిర, ప్రియాంక, జగన్, భువనగిరి నారాయణ, అప్పారావు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616